కథ :

# ఊసరవెల్లి

రచన: శ్రీ హవిస్

మా తమ్ముడు సూర్యం స్కూలు ఫైనలు పరీక్ష తప్పాడు. ఆ సంఘటన నాకు చాలా ఆశాభంగాన్ని కలిగించినా వాడి అర్భకత్వం తెలిసినవాడిని కావటాన ఏమీ అనలేకపోయాను. అయితే ముందు చేయాల్సింది ఏమిటన్న సమస్యకు పరిష్కార మార్గం ఆలోచించటం మాత్రం మానలేదు. ఆకాస్తా వాడు గట్టెక్కేస్తే ఆ తరువాత ఏ టైప్ రైటింగో పాసయి నాలాగే వాడూ తనపొట్ట తాను పోషించుకుంటాడు. అందువల్ల నాకు వాడ్ని తిరిగి చదివించాలనే అనిపించింది. అయితే మళ్ళీ వాడ్ని స్కూల్లో జేర్పించటం నావల్లనయే పనికాదు అవివాహితుడ్నే అయినా అంతభారం, మళ్ళీ మోయగల శక్తి లేదని పించింది. అలా ఆలోచనల్లో వుండగానే ఒకనాడు సుబ్బారావు వొచ్చాడు. అతను నాకు అప్త మిత్రుడు. సహోధ్యాయి కలవారిబిడ్డ. అతను నా సమస్య వినగానే "అందుకు యింతగా మధనపడటం దేనికోయ్? ప్రయివేటుగా కట్టిస్తేపోలా?" అన్నాడు. ఆ తరువాత "మావాడ్ని ప్రయివేటుగానే కట్టిద్దామనుకుంటున్నాను" అన్నాడు. నాకు కించిత్ విస్మయం కలిగింది. "మీ వాడూ తప్పాడా?" అన్నాను. వాడు నవ్వి "బ్రహ్మాండంగా" అన్నాడు.

"మరి అసలే మావాడి తెలివి అంతంత మాత్రం కదా? తనంతతాను చదువుకోగలడా?"

"దానికేదో పరిష్కారం వుంది. శేషయ్యగారని నాకు తెలిసిన మాష్టరుగారొకాయన వున్నారు. అఖండుడు. ఆయన దగ్గర ప్రయివేటు కుదిరిస్తేసరి"

"ఎంత తీసుకుంటాడో?"

"ఆ సంగతులన్నీ నేను మాట్లాడతానుగా? ఇష్టమయితే చెప్పు. రేపెలాగూ ఆదివారం గనక యిద్దరం కలిసే పోదాం. తంబిగాళ్ళిద్దరి సంగతి మాట్లాడదాం"

"ఏడెనిమిదికి మించి యిచ్చుకోలేను" అన్నాను అది నిష్ఠూర్యం మేలని.

"అలాగే లేవోయ్." అన్నాడు సుబ్బారావు.

మరునాడు అనుకున్న ప్రకారం నలుగురమూ అక్కడికి వెళ్లాం. శేషయ్యగారి యిల్లు చాలా పాతది. పెంకుటిల్లు ముందు ఖాళీస్థలం వుంది. ప్రహారిగోడ వయసు మళ్ళిన తనం ఆధారంగా రకరకాల మొక్కలు పెరిగాయి. ఖాళీస్థలంలో ఇద్దరు ముగ్గురు పిల్లలు ఆడుకుంటున్నారు. అందులో వొక పదేళ్ల కుర్రాడు మమ్మల్ని చూడంగానే "నాన్నగారూ! మీకోసం ఎవరో వొచ్చారు" అని పొలికేక పెట్టి తిరిగి ఆటలో మునిగి పోయాడు. మేం ముందు వసారాలోకి వొచ్చేసరికి వొక ఏభయి అరవయిఏళ్ల ఆయన ఎదురొచ్చి "మీరా సుబ్బారావుగారూ, రండి రండి" అని ఆహ్వానించాడు. అంతా వసారాలో కూర్చున్నాక సుబ్బారావు అసలు సంగతి కదిపాడు. ఆయన అంతా విని "దానికంతేనా? రేపు చాలా మంచిరోజు, పంపించండి" అన్నాడు. మా వాడు జీతం సంగతి కదిపి "ఇద్దరికీ కలిపి పదిహేను యిస్తాం" అన్నాడు. "దాన్దేముందిలెండి? వాళ్లకి చదువు బాగా రావటం కావాలి" అన్నాడు చిరునవ్వుతో ఆయన.

అంతసులభంగా త్వరితంగా సమస్య పరిష్కార మయిపోయి నందుకు ఆనందించి ఆయనదగ్గర శెలవుతీసుకుని బయలుదేరబోయాం. ఇంతలో వాకిటి గుమ్మంలోకి వొక వ్యక్తి తూలుకుంటూ లోపలికి వొచ్చాడు నలభయి సంవత్సరాలుంటాయి. బట్టలన్నీ మాసిపోయి వున్నాయి. నాటుసారా వాసన ఆ ఆవరణ అంతా గుప్‌మన్నది. పిల్లలు ఆట ఆపేసి నిలబడ్డారు. వొక్క క్షణానికి శేషయ్యగారి కుమారుడు రహస్యంగా ఆ కొత్త వ్యక్తిని గురించి స్నేహితులతో ఏదో చెబుతూండటం గమనించాను.

ఆ కొత్తవ్యక్తిసరాసరి మేము కూర్చున్న దగ్గరకే వొచ్చి "నమస్కారం మాష్టారూ" అన్నాడు. శేషయ్యగారు ప్రతి నమస్కారం చేసి జాలిగొంతుతో "ఏం యిలా వొచ్చారు?" అన్నాడు. అతను మరో మాట లేకుండా "వొక పదిరూపాయలుంటె కావాలి మళ్లీ వారం రోజుల్లో యిస్తాను" అన్నాడు. శేషయ్యగారు లేచి "అంతకన్నానా బాబూ? వొక్కక్షణం ఆగండి" అని లోపలికివెళ్లి పైకం తెచ్చి యిచ్చారు. అతనది తీసుకుని "వొస్తాను" అని తొందర తొందరగా వెళ్ళిపోయాడు.

నాలాగే సుబ్బారావూ ఆ సన్నివేశాన్ని అత్యంతాసక్తితో పరికించటం గమనించాను. ఆ తాగుబోతుతో యీ పంతులుగారికి ఏమిటి బాంధవ్యం? తెలుసుకోవాలని పించినా అడగటానికి నాకు ధైర్యం చాల్లేదు. మా సుబ్బారావు మాత్రం 'ఎవరండీ ఆయన?' అన్నాడు.

"రామారావుగారని వొక అధికారి" అన్నాడాయన.

"మరి అదేం ఖర్మం?"

"ఖర్మమే సుబ్బారావుగారూ! పెళ్లాన్నీ మామగార్నీ నమ్మి ఆస్తంతా వాళ్ల చేతుల్లో పెట్టాడు. వాళ్లు యితన్నొక పురుగుకింద చూస్తున్నారు. ఆత్మాభిమానం కలవాడు కావటాన ఆబాధ భరించలేక యిలా తప్పతాగేసి తిరుగుతూంటాడు."

"అంత రాసి రంపాన పెడుతున్నారా?"

"నాకు తెలుసు బాబూ! బంగారపు గిన్నెల్లో పాయసాన్నం తినిబతికిన మనిషి. ఈనాడిలా అయిపోయాడు."

"తాగుడు యీ మధ్యే అలవాటయిందన్నమాట?"

"పూర్తిగా కాదనుకోండి. కాని యీ కారణంవల్లే ఎక్కువైంది"

నాకు ఆయన చెబుతున్నదాంట్లో ఏదో గొప్ప అబద్ధం, స్వార్థం కనపడింది. అది అర్థంచేసుకోగల విజ్ఞానం మాత్రం నాకు భగవంతుడు యివ్వలేదు. అయినా అతడి సంగతులు నాకెందుకు? సుబ్బారావుతో పాటె నెలపుతీసుకుని వొచ్చేశాను. మరు నాడు వాడితమ్ముడితోబాటు మా తమ్ముడూ ట్యూషన్‌లో జేరాడు.

నెలరోజులు గడిచాయి.

ఈ నెలరోజుల్లోనూ రెండు మూడు సార్లు సూర్యం చెంప ఎర్రగా కందిపోయి వుండటం, ఒంటరిగా కూచుని వాడు ఏడుస్తూ వుండటం గమనించాను. తరిచి తరిచి అడగ్గా వొకసారి వాడు బలవంతాన నిజం చెప్పాడు. "స్టోరీ అప్పచెప్పలేదని మాస్టారు కొట్టారన్నయ్యా" అని. ఆమాట విన టంతోటే నాకు వొళ్ళు మండి పోయింది. పసివాడు వాడు, వెధవ పాఠం ఒప్పచెప్ప లేదని చంపుతాడా? పోయి ఆయన్ని నాలు గూ అడిగేద్దామనుకున్నాను. అయితే మరోసారి ఆలోచించిన మీదట అలా పోట్లాడడంలోగల నష్టం అర్థమయింది. ఆ ప్రయివేటు వూడిపోతే మరో టీచరు అంత తక్కువ ధరకి దొరకటం అసం భవం. అదీగాక సుబ్బారావుతో విరోధం కూడా రావచ్చు. అది నాకే నష్టం.

అందుకని అప్పటికి వాడ్ని సముదా యించాను.

మరో వారం రోజులు గడిచాయి.

ఆ రోజు ఆదివారం. పొద్దున్నే కాల కృత్యాలను తీర్చుకుని అలా బయటికోసారి వెళ్దామని బయలుదేర బోతుండగా సుబ్బారావు వొచ్చాడు. వాడి మొహం చూడగానే ఏదో జరగకూడనిది జరిగి వుం టుందనిపించి "అలా వున్నావేం భాయ్" అన్నాను.

"ఆ శేషయ్యగాడి ధోరణి రాను రాను మితిమీరి పోతోంది. ఇవాళ గట్టిగా బుద్ధి చెప్పాలి" అన్నాడు విసురుగా.

నివ్వెరపోయి "ఏం జరిగింది?" అన్నాను.

"అసలే మావాడు మెత్త మెతకవాడు. పాఠాలు సరిగా చదవటంలేదట - డాబు సరీ దర్జా వుండగానే సరికాదు చదువుకో వాలిరా వెధవా అంటాట్ట. వాడు ఇంటి కొచ్చి మూతిబిగించుక్కూచున్నాడు. ఎంత మేష్టరయితే మాత్రం వెధవా అంటాడా?"

నేను నోరు విప్పలేదు.

"బండ మనస్సు వాళ్లయితే వో దెబ్బ వేసినా దులుపుకు తిరగ్గలరు భాయ్! వాడిది అతి సున్నితమయిన మనస్సు.

సుబ్బారావు ధోరణిలో గర్హనీయ మయిన అంశం నాకేమీ కనపడలేదు. నిజమేనేమో? అయినా యీ ఇరవయ్యో శతాబ్దంలో పిల్లల్ని కొట్టి తిట్టే మాష్టర్లు న్నారా?

"నువ్వుకూడా వొస్తావా?" అన్నాడు వాడు

"పద" అన్నాను.

శేషయ్యగారు మేం వెళ్ళేసరికి ధుమ ధుమలాడుతున్నాడు, మమ్మల్ని చూడం గనే ఆ ధాటి కాస్త తగ్గించుకుని "రం డయ్యా" అన్నాడు. ఇద్దరం కూర్చున్నాం. ఆయన కొడుకు అవతలగా నిలబడి వున్నాడు.

"ఏవిఁటిలా వొచ్చారు?" అన్నడాయన.

"మీతో ఒక విషయం చెబుదామని వొచ్చాను" అన్నాడు సుబ్బారావు

"చెప్పండి"

"ఏంలేదు. మీరు మా వాడ్ని చీటికీ మాటికీ వెధవా, కుంకా అంటున్నారట. వాడు యింటికొచ్చి అన్నమన్నా తినకుండా పడుకుంటున్నాడు." అన్నాడు సుబ్బారావు.

"అయితే పాఠాలు సరిగా చదవనివాడ్ని నెత్తినెక్కించుకోమంటారా?"

"అనను. ఆ చెప్పేదేదో కాస్త మర్యా దగా చెప్పమంటాను"

"అంటే?"

"అంతకన్నా సౌమ్యమయిన మాటలు మీకు రావా?"

"చూడండి సుబ్బారావుగారూ! ఈ టీచరు వృత్తిలోనే నాతల నెరిసిపోయింది. పిల్లలకి పాఠాలు ఎలా చెప్పాలో చదవక పోతే ఏం చేయాలో తెలియని వాడ్నికాదు. నాకు మాత్రం వాడిమీద ఏవఁన్నాపగా?"

"అలాగే కనిపిస్తోంది"

"అయితే ఏమిటంటారు?'

'మీరు మర్యాదగా పాఠాలు చెబుతా నంటారా సరేసరి. లేకపోతే మరో టీచర్ని చూసుకుంటాం'

'మహారాజులా కుదుర్చుకోండి. బెది రిస్తారా? అయినా మీవాడి లాంటి వాడ్ని జేర్చుకోవటం నాదే బుద్ధి తక్కువ. సూర్యం లాంటి వాడికి నాలుగు ముక్కలు వూరికే చెప్పినా అంతకన్నా సత్ఫలితం కలుగుతుంది.

'నోర్మూయ్'

కలుగజేసుకోక తప్పదనిపించి 'వూరు కోరా సుబ్బారావ్. ఇహనుంచీ ........' అని సర్దిచెప్ప బోయాను.

సుబ్బారావు వినిపించుకో లేదు. లేచి 'అప్పన్లే నీ తమ్ముడికి వూరికే చదువు చెబుతా నన్నాడుగా? మాట్లాడు మాట్లాడు ఛీ! ఈ జనమే అంతా. కూటికీ గుడ్డకీ గతిలేకపోయినా....గుడ్‌బై' అని అరుస్తూ వెళ్లిపోయాడు.

అతను వెళ్ళిపోయిన అయిదునిముషాల దాకా శేషయ్యగారు సుబ్బారావుని తిడుతూనే వున్నాడు. చివరికి నాబుజంచరిచి 'అన్న మాట నిలబెట్టుకుంటాను. ఈ నెల నుంచీ నువ్వు నాకు దమ్మిడీ యివ్వొద్దు. వాడ్ని పాసు చేయించే పూచీ నాది' అన్నాడు. ఆయన ఆవేశానికి పవిత్ర హృదయానికి మనసులోనే జోహార్లు చేశాను.

'అయినా ధనమదం అలా అనిపిస్తుంది పంతులూ! మాఅల్లుడో త్రాష్టుడున్నాడులే సప్తవ్యసనాలూ వున్నాయి. ఆస్తి హారతి కర్పూరంలా హరింప జేస్తుంటే నేనూ మా అమ్మాయీ కలసి కాస్త పొలమూ రెండు మేడలూ దాని పేర రాయించాం.

(తరువాయి 20 వ పేజీలో)

## ఊసరవెల్లి

(10 వ పేజీ తరువాయి)

ఇప్పుడు ఆ వూరంతా ప్రచారం చేస్తున్నట్టు నేనూ అదీ కలిసి తన్ని బికారిని చేశామని. తాగి తందనాలాడటానికీ వ్యభిచరించటానికీ పాపం అవసరమయి ఎవడి దగ్గరో అయిదువేలు అప్పు చేశాట్ట అది తీరుస్తావా నిన్ను చంపి నేను చావనా అని కూర్చుంటే కుర్రది బెదిరి రేచ్చకొచ్చింది. ఎలాగూ వొచ్చింది రానే వొచ్చింది. ఆ దౌర్భాగ్యుడి తిక్క అణిగే దాకా ఇక్కడ ఉండి పొమ్మన్నాను." అన్నాడాయన తిరిగి.

"అలాగా ?" ఆయన మేం వొచ్చేసరికి ఎందుకు ధుమ ధుమ లాడు తున్నాడో అర్థమయింది.

"ఏదో కడుపులో దుగ్ధ తీరకివాగేశాను. ఏమనుకోకు" అన్నాడాయన తిరిగి.

"దానికేముంది లెండి ? ఆప్తులంటూ వున్నది కష్ట సుఖాలు పంచుకునేందుకేగా ?" అన్నాను మర్యాదగా.

'ఆ మాత్రం సద్బుద్ధి కలవారెందరు ?'

చిరునవ్వు నవ్వి లేచాను. "ఇహ వెళ్తాను. శెలవు" అన్నాను చేతులు జోడించి.

"అలాగే సూర్యాన్ని సాయంత్రమో సారి పంపించు వనుంది''

తలవూపి నాలుగడుగులు వేశాను. శేషయ్యగారి కుమారుడు ప్రహారీ గోడ యివతలగా నిలబడి జిల్లేడు మొక్క వంక దీక్షగా చూస్తున్నాడు. నవ్వొచ్చి ఏవిఁటోయ్ ?'' అన్నాను. వారు నా వంకయినా తిరగకుండా 'ఊసరవెల్లి మాష్టారూ' అన్నాడు.

ఉలిక్కిపడి తమాయించుకుని తెచ్చిపెట్టుకున్న నవ్వుతో "చూడు చూడు" అనేసి వీధిలోకి వొచ్చాను.

—o—

## నీలాటిరేవు

(24 వ పేజీ తరువాయి)

ఆమె మనస్సులోని దుఃఖం ఆపు రేకపోయింది. పమిట చెంగులో ముఖాన్ని దాచుకొని సన్యాసి పాదాలకడ బావురుమని విలపించింది.

అతడు కొద్దిగా వెనకకు జరిగి "నీమనసులో యేమి ఆవేదన వున్నదో స్పష్టముగా చెప్పు. నేను నీకు శాంతికి మార్గము చూపిస్తాను" అన్నాడు.

గద్గద స్వరంతో. నిశ్చలనమ్రకంతో, మాటలు తడబడుతు ఆమె "మీరు ఆజ్ఞయిస్తే నేను తప్పక చెపుతాను కాని నేను వివరంగా విశదీకరించలేను. స్వామీ, ఆ తరువాత మీరే ఆలోచించుకోవాలి నేను ఒకరిని నా ఆరాధ్య దేవతగా అలంకరించుకున్నాను; ఆయననే పూజించాను. ఆ భక్తి తత్పరతయే నా హృదయ కుహరాన్ని ఆవరించి ముంచి తేల్చింది, ఒక నాటి రాత్రి సుందర వుద్యానవనంలో నా మనోనాథుడు నా చేతిలో తన చేతినుంచి ప్రేమ వాక్యాలు పలుకుతున్నట్లు కలగన్నాను. ఈ కలంతయు నాకు సుంతయైన వింత గొల్పలేదు. కల మాయమైంది. కాని దాని ప్రభావం మాత్రం నాలో నిలచిపోయింది. మరునాడు నేను చూడగా వున్నచోటనగాక మరొక చోటన వున్నాడు. ఆ స్వప్న జగత్తు నా మనస్సులో మెదలడం మొదలు పెట్టింది. నేనతని నుండి భయంతో దూరంగా పరుగెత్తాను. కాని ఆ చిత్తరువు నన్ను వెంట నంటియే యున్నది. ఆ నాటి నుండి నా మనసున శాంతి అనునది యెరుగను, నాలో అంతా తమస్సు ఆవరించి పోయింది.

ఆమె తన కథను చెపుతూ కన్నీరు తుడుచుకుంటుంటే సన్యాసి తన వాము పాదం బొటనవ్రేలితో నన్ను గట్టిగా నొక్కుతున్నట్లు నే ననుభవించాను

ఆమె చెప్పడం పూర్తికాగానే సన్యాసి "నీ స్వప్నంలో చూచిన దెవరినో నీవు తప్పక చెప్పవలయు" నన్నాడు.

ఆమె రెండు చేతులు మోడ్చి "నావల్ల కాదు" అన్నది.

"నీవు తప్పక అతడెవరో చెప్పితీరవలెన"ని అతడు పట్టు పట్టాడు. చేతులు నలుపు రుంటూ అమాయకంగా ఆమె "తప్పదా" అన్నది.

"తప్పదు" అన్నాడాతడు.

ఆమె "నీవే స్వామీ !" అని నాకర్కశ శిలా ఫలకంపై తలనుంచి వెక్కి వెక్కి యేడ్వడం ప్రారంభించింది.

ఆమె దప్పరిల్లి కూర్చున్న తరువాత సన్యాసి నెమ్మదిగా "నేను యీ ప్రదేశాన్ని యీ రాత్రి వీడుతున్నాను. నీవు నన్ను మరల చూడబోవేమో. నేను ఈ ప్రపంచమునకు సంబంధించిన వానిని కాదని 'సన్యాసి' నన్నది మాత్రము గుర్తుంచుకో నన్ను మాత్రం మరచిపో అన్నాడు.

''అట్లే స్వామీ !'' కుసుమ అభో స్వరంతో సమాధాన మిచ్చింది.

'నేను సెలవు తీసుకుంటాను' అన్నాడు సన్యాసి.

మారుమాటాడక కుసుమ అతనికి నమస్కరించి పాద రజోరేణువులను శిరసున దాల్చింది అతడక్కడ నుండి వెళ్ళిపోయాడు,

చంద్రుడుకూడ పశ్చిమాద్రికి తరలిపోతున్నాడు. రాత్రి అంధకారావృతమయింద ఒక్క అల ముందుకు నెట్టుకొచ్చినట్లునిపించినది నాకు. ఆకాశంలోని నక్షత్రాలను పారద్రోలుతున్నదా అన్నట్లు చీకటిలో ఒక గాలి తరంగం చెలరేగి లేచింది

(రవీంద్రుని ''దిరివర్ స్టేర్స్ అను కృతికి స్వేచ్ఛాను కృతి)

చుక్కాని

ఆంధ్రుల అభిమాన పత్రిక.

నేడే చందా దారులుగా జేరండి.

సాలు చందా రు. 4-50 మాత్రమే.